సాక్షి
తిరుపతి
శనివారం । 26 । అక్టోబర్ । 2024



ర్యాగింగ్‌తో భవిష్యత్ అంధకారమే

ర్యాగింగ్‌తో విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. - 10లో



గ్రంథాలయాలు..

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వీటిని సాంకేతిక పరిజ్ఞానంతో అందించాలని ఎస్వీయూ వీసీ పేర్కొన్నారు. - 10లో



పక్కాగా పశుగణన

పశుగణన పక్కాగా చేపట్టాలని పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎంఎం.నాయక్ సిబ్బందిని ఆదేశించారు. - 10లో

న్యూస్‌రీల్

తిరుపతి రైల్వేస్టేషన్‌లో మొరాయించిన లిఫ్ట్

- చిక్కుకున్న దంపతులు
- కాపాడిన జీఆర్పీ, ఆర్పీఎఫ్



లిఫ్ట్‌లో నుంచి బయటపడ్డ దంపతులు

తిరుపతి (అలిపిరి) : తిరుపతి రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఉన్న లిఫ్ట్ శుక్రవారం రాత్రి 9 గంటలకు మొరాయించింది. అందులో ప్రకాశం జిల్లాకు చెందిన సాయిబాబా, దంపతులు చిక్కుకున్నారు. దీంతో ప్రయాణికులు, స్టేషన్ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. దాదాపు 1.45 గంటలపాటు ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు శ్రమించి లిఫ్ట్ ఓపెన్ చేసి వారిని బయటకు లాగడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

1న కేదార గౌరీ వ్రతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దీపావళి సందర్భంగా నవంబర్ 1న నిర్వహించే కేదార గౌరీ వ్రతానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసంలో ఆలయాన్ని దీపాల కాంతితో ముస్తాబు చేయాలన్నారు. ఈ శక్తితో మనం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు బలం చేకూరుతుందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చే ప్రతి భక్తునికీ తప్పనిసరిగా ప్రసాదాలు అందించాలన్నారు. ఒక్కో సోమవారం ఒక్కో కోనేరులో దీపాలు వెలిగించాలని, అందులో భక్తుల భాగస్వామ్యం అవసరమన్నారు.

నేడు డీఈఓ బాధ్యతల స్వీకరణ



కేవీఎన్ కుమార్, డీఈఓ, తిరుపతి

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారిగా కోట వెంకట నాగేంద్రకుమార్(కేవీఎన్ కుమార్‌ను) నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన శనివారం ఉదయం 11 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్టీఆర్ జిల్లా డీఈఓగా పనిచేస్తున్న ఆయనను మదనపల్లి ఉప విద్యాశాఖాధికారిగా నియమించడంతోపాటు తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారిగా పూర్తి బాధ్యతలు అప్పగించారు. మరోవైపు ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ వీ.శేఖర్‌ను కార్వేటినగరంలోని డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,004 మంది స్వామివారిని దర్శించుకోగా 20,173 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నవంబర్‌లో సాగునీటి ఎన్నికలు

తిరుపతి అర్బన్: పదేళ్ల తర్వాత టీడీపీ ప్రభుత్వం మళ్లీ ఆయకట్టు ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. అన్ని వర్గాల్లో గ్రూపు రాజకీయాలు ఉండాలన్నదే ఆ పార్టీ పచ్చనేతల పన్నాగంగా తెలుస్తోంది. పల్లె ప్రాంతాల్లో ప్రశాంతంగా తమ పనులు తాము చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ఎన్నికల సెగ పుట్టిస్తున్నారు. ఎన్నికలతో అన్నదాతలను రెండు వర్గాలుగా చీల్చనున్నారు. సాగునీటి ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఆ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సాగునీటి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.

నవంబర్ 21 నుంచి ఎన్నికలు

నవంబర్ 21వ తేది నుంచి 23వ తేది వరకు దశలవారీగా జిల్లాలోని 631 చెరువులకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులతోపాటు తెలుగుగంగ ప్రాజెక్టు సభ్యులకు ఎన్నికలు చేపట్టనున్నామని గురువారం నోటి ఫికేషన్‌లో కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ వెల్లడించారు. ఇరిగేషన్‌తోపాటు రెవెన్యూ అధికారులు రైతుల ఓటర్ల తుది జాబితాను ఈ నెల 31వ తేదికి సిద్ధం చేయాలని, ఆయా చెరువుల పరిధిలోని పంచాయతీల వద్ద జాబితాను ప్రచురించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే నవంబర్ ఒకటో తేదీన ఫిర్యాదులను స్వీకరిస్తామని వెల్లడించారు. అనంతరం నవంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు ఎన్నికలు ఉంటాయని చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సాగునీటి ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

లక్షణంగా బెల్టు!

టీడీపీ కార్యకర్త

అన్నా.. మద్యం షాపు లైసెన్స్ కోసం డబ్బు కట్టాను. మీరొద్దంటే విరమించుకున్నాను. మీకు తెలుసు కదా నా పరిస్థితి. మా చుట్టు పక్కల ఊర్లల్లో బెల్టుషాపులు పెట్టుకుంటాను. మందివ్వండి. అమ్ముడు పోయాక రోజూ సాయంత్రానికి డబ్బులు కట్టేస్తాను. ఈ ఒక్క అవకాశం ఇవ్వండన్నా.

మద్యం షాపు యజమాని

బెల్టు షాపు అంటే ఆషామాషీ కాదు. మద్యం షాపుకంటే ఎక్కువ. బెల్టు షాపులు ఎక్కడ పడితే అక్కడ.. ఎవరికంటే వారికి ఇచ్చేది లేదు. ఒక బెల్టు షాపు పెట్టుకోవాలంటే ముందుగా రూ.లక్ష అడ్వాన్స్ ఇవ్వాలి. లేదంటే వేలం పాట పెడుతాము. ఆ పాటలో ఎంతకు పాడుకుంటావో పాడుకో.

టీడీపీ కార్యకర్త

అదేంటన్నా.. మీ కోసమే కదా లైసెన్స్ కోసం డబ్బులు కట్టి వదులుకున్నాను. పార్టీ కోసం కూడా కష్టపడ్డాను కదా. ఆ మాత్రం హెల్ప్ చేయ్యలేరా?. వేలం పాట వరకు వద్దులే అన్నా. మీరు అడిగినట్టే రేపు ఒక షాపుకి లక్ష రూపాయలు తీసుకొచ్చి ఇస్తాను.

.. ఇదీ తిరుపతి జిల్లా, తూర్పు నియోజకవర్గంలో టీడీపీ నేత, మద్యం షాపు యజమాని మధ్య జరిగిన సంభాషణ. ఊరికో బెల్టు షాపు.. షాపుకో పర్మిట్ రూమ్ కోసం అప్పుడే కూటమి నేతలు బేరసారాలు మొదలు పెట్టేశారు. ముందుగా ఎవరు లక్ష రూపాయలిస్తే వారికి బెల్టు షాపు కట్టబెట్టేస్తున్నారు. ఒకే ఊర్లో అధిక పోటీ ఉంటే వేలం పాట నిర్వహించి అదృష్టాన్ని పరీక్షించుకోమని సూచిస్తున్నారు. అలాగే మద్యం దుకాణం పక్కనే పర్మిట్ రూమ్ ఏర్పాటుకు గుట్టుచప్పుడు కాకుండా స్థలాలు ఎంపిక చేస్తున్నారు. వీటిని ఎవరికి కట్టబెట్టాలి.. ఎంత వసూలు చేయాలనే విధివిధానాలు రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.





తిరుపతి నగరంలో అనధికారిక పర్మిట్ రూం

ఊరికో బెల్టు దుకాణం.. షాపుకో పర్మిట్ రూం

- బెల్టు దుకాణం కావాలంటే రూ.లక్ష ఇవ్వాల్సిందే
- పలుచోట్ల గుట్టుచప్పుడుగా వేలం పాటలు
- చిత్తూరులో అప్పడే పర్మిట్ రూమ్‌ల ఏర్పాటు
- షాపుల కోసం కుమ్ములాడుతున్న కూటమి శ్రేణులు

చిత్తూరు ..అదే జోరు

- చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గంలో మద్యం దుకాణ యజమానులు, తమ్ముళ్లు కలిసి బెల్టు షాపుల ఏర్పాటుకు వసూళ్లకు దిగుతున్నారు. ఒక్కో షాపునకు లక్ష రూపాయల చొప్పున వసూలు చేసి బెల్టు దుకాణాలు కట్టబెట్టేస్తున్నారు.
- చిత్తూరు నగరంలో 14 మద్యం దుకాణాలుంటే.. ఒక్కో షాపు నిర్వాహకుడు ఒక్కో పర్మిట్ రూం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకుని ఎక్కువ మందిచేత వీలైనంత ఎక్కువ మద్యం కొనుగోలు చేయించి తాగించేందుకు గట్టిగా కృషి చేస్తున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రశాంతతకు మారుపేరైన పల్లెల్లో మద్యం ఏరులై పారనుంది. ఊరికో బెల్టు షాపు ఏర్పాటు చేసేందుకు కూటమి నేతలు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా బెల్టు దుకాణం ఏర్పాటుకు రేటు నిర్ణయించారు. మరోవైపు నగరాలు, పట్టణాల్లో పర్మిట్ రూంలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ఇప్పటికే పర్మిట్ రూంలు ఏర్పాటు చేసేశారు. నూతన మద్యం పాలసీ విధానం ద్వారా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 331 దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. టెండర్లు దక్కించుకున్న కొందరిని కూటమి నేతలు భయపెట్టి, ప్రలోభపెట్టి అనేక మద్యం దుకాణాలను లాక్కున్నారు. మరికొందరిని బెదిరించి దుకాణాలు ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్నారు. కొందరు దుకాణదారులు సిండికేట్‌కు లొంగకపోవడంతో దాడులకు తెగబడుతున్నారు. ఇళ్లకు తాళాలేసి అరాచకం సృష్టిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్టు చోద్యం చూడడం గమనార్హం.

నయా దందా!

పెట్టుబడితో పాటు అధిక లాభార్జనే లక్ష్యంగా కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రతి దుకాణానికీ ఒక్కో బెల్టు షాపు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇంకొందరు మద్యం సిండికేట్లు ప్రతి పల్లెలోనూ బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో బెల్టుషాపులను కేటాయించడం, వసూళ్ల పర్వంలో వైన్స్‌షాపుల నిర్వాహకులు, తెలుగు తమ్ముళ్లు సరికొత్త దందాకు తెరలేపారు. పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తమ్ముళ్లు బెల్టు షాపుల కేటాయింపులో నిమగ్నమయ్యారు. బెల్టు షాపుల ఏర్పాటులో టీడీపీ నేతల మధ్య పోటీ పెరగడంతో గ్రూపు తగాదాలు మొదలయ్యాయి. ఒక బెల్టుషాపు కేటాయించాలంటే లక్ష రూపాయాలు తమ్ముళ్లకు చెల్లించాలనే నిబంధన పెట్టారు. లక్ష రూపాయలు ముందుగా అడ్వాన్స్ చెల్లించిన వారికే బెల్టు షాపు కట్టబెడుతున్నారు. ఒక పల్లెలోనే ఇద్దరు ముగ్గురేసి పోటీపడుతుండడంతో బెల్టు షాపులకు డిమాండ్ పెరిగింది. దీంతో కొన్ని చోట్ల వేలంపాట నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు. ఇలా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో లక్ష రూపాయలు ఇచ్చిన వారికి బెల్టు షాపు, డిమాండ్ ఎక్కువ ఉంటే.. వేలం పాట ద్వారా కట్టబెడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న బెల్టు దుకాణాల ఏర్పాటుపై పల్లెజనం భగ్గుమంటున్నారు.

పర్మిట్ రూంలు.. ఆర్భాటాలు


చిత్తూరు, తిరుపతి నగరాల్లో మద్యం దుకాణాల యజమానులు పర్మిట్ రూంలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పర్మిట్ రూంలు ఏర్పాటు చేయకూడదనే నిబంధనలు ఉన్నా.. అధికారపార్టీ నేతలు బరితెగిస్తున్నారు. చిత్తూరు నగరంలో మొత్తం 14 మద్యం షాపులు ఉంటే.. ప్రతి దుకాణ యజమాని పర్మిట్ రూం ఏర్పాటు చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. అలా కొందరు అధికరపార్టీ నేతలు నగరంలో పర్మిట్ రూంలు ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం తాగించి సొమ్ము చేసుకునేపనిలో నిమగ్నమయ్యారు. తిరుపతి నగరంలో పర్మిట్ రూంలు ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేశారు. పర్మిట్ రూంల బాధ్యతలు ఎవరికి అప్పగించాలి, పర్మిట్ రూం ఏర్పాటుకు నిర్వాహకుడి నుంచి ఎంత వసూలు చేయాలనే విషయంపై చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.



తిరుపతిలో అనధికారిక పర్మిట్ రూమ్‌లో ఇలా..

మద్యం షాపుతో ప్రాణాలు తీయ్యొద్దు

తిరుపతి కల్చరల్: నిత్యం యాత్రికుల రద్దీతో పాటు వందలాది కుటుంబాలు నివాసాలున్న తిరుపతి కస్తూరిబా వీధిలో మద్యం షాపు ఏర్పాటుతో తమ ప్రాణాలు తీయ్యొద్దంటూ శుక్రవారం స్థానిక మహిళలు నినదించారు. తిరుపతిలో మద్యం షాపు దక్కించుకున్న టీటీడీ నేత కంకణాల రజనీకాంత్ అధికార పార్టీ అండతో అధికంగా ఆదాయ వనరులు పొందేందుకు అటు శ్రీగోవిందరాజస్వామి ఆలయం, ఇటు రైల్వేస్టేషన్, పాఠశాల ఉన్నటువంటి కస్తూరిబా వీధిలోని వీధి ముఖద్వారం వద్దనున్న ఖాళీ స్థలంలో మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు యత్నించారు. మినీ ఆటోల ద్వారా మద్యం సరుకును తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక మహిళలు మద్యం షాపు ఏర్పాటు చేసే స్థలం వద్దకు చేరుకుని అడ్డుకున్నారు. మద్యం దుకాణ దారులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మద్యం తీసుకొచ్చిన మినీ ఆటోలను అక్కడి నుంచి పంపేశారు. అనంతరం స్థానిక మహిళలు శిరీష, రాధమ్మ, కృష్ణవేణి మాట్లాడుతూ కస్తూరిబా వీధిలో సుమారు 500కుపైగా కుటుంబాలు ఉన్నాయన్నారు. పక్కనే రైల్వేస్టేషన్ ఉండడతో నిత్యం యాత్రికుల రద్దీ ఉంటుందన్నారు. అంతేగాక ఇదే వీధిలో పాఠశాల కూడా ఉందన్నారు. ఆర్‌సీ రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణంతో అటు వైపు దారి లేకపోవడంతో ఇక్కడ నివాసమున్న కుటుంబాలకు ఇదే దారి తప్ప వేరేది లేదన్నారు. ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే మహిళలకు, చిన్న పిల్లలకు రక్షణ ఉండదని వాపోయారు. పిల్లలు, తమ భద్రత కోసం ప్రాణాలకు తెగించి అయినా అడ్డుకుని పోరాడుతామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు సర్దిచెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. మహిళలు రాధాబాయి, గుండ్లమ్మ, హారిక, జయమ్మ, లక్ష్మి, పద్మ,వాసు, యుగంధర్, మధు, లోకేష్ యాదవ్, కార్తీక్ పాల్గొన్నారు.



మద్యం సరుకు ఉన్న ఆటోను అడ్డుకుని నిలిపివేసిన స్థానికులు



మద్యం షాపు ఏర్పాటును అడ్డుకుంటున్న స్థానిక మహిళలు

డిజిటల్‌తోనే వ్యాపారాభివృద్ధి

- అంతర్జాతీయ నిపుణులతో మహిళా పారిశ్రామిక వేత్తలకు శిక్షణ
- మార్కెట్ విస్తరణ, వ్యాపార సౌలభ్యమే ధ్యేయంగా తర్ఫీదు
- పలు ప్రాంతాల నుంచి శిక్షణకు హాజరైన మహిళా పారిశ్రామిక వేత్తలు



డిజిటల్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్న ఫారిన్ ట్రైనర్లు, హాజరైన ఉమెన్ ఎంట్రపెన్యూర్స్

తిరుపతి సిటీ: యునైటెడ్ నేషన్స్ ఏషియన్ అండ్ పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఫర్ డెవలప్‌మెంట్, పద్మావతి మహిళా వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ నిపుణులతో ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు డిజిటల్ టెక్నాలజీపై మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్ వేదికగా జరుగుతున్న వైఫై డీఎక్స్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ శిక్షణ కార్యాక్రమానికి థాయిలాండ్, యునైటెడ్ నేషన్స్, ఫిలిప్పీయన్, సింగపూర్ వంటి దేశాల నుంచి ప్రత్యేక ట్రైనర్లు హాజరయ్యారు. ప్రధానంగా చిన్నతరహా, మధ్యతరహా, స్వయం సహాయక వ్యాపార సంస్థలను నడుపుతున్న మహిళలను డిజిటల్ టెక్నాలజీ వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో శిక్షణ ఇచ్చేందుకు దేశంలోనే ప్రథమంగా పద్మావతి మహిళా వర్సిటీ ఎంపిక కావడం గమనార్హం. శిక్షణలో ప్రధానంగా మహిళలు నిర్వహిస్తున్న వ్యాపార లావాదేవీలను, మార్కెట్ వ్యవహారాలను పూర్తి స్థాయిలో ఎలా డిజిటలైజేషన్ చేయాలి, సులభంగా, సౌకర్యవంతంగా అధిక ఆదాయాలను ఆర్జించే మెలకువలు నేర్పుతున్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 60మంది మహిళా ఎంట్రపెన్యూర్స్ ఈ శిక్షణకు హాజరయ్యారు.

డిజిటల్ వ్యవస్థ అవసరం



ఆధునిక సమాజంలో డిజిటల్ టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషిస్తోంది. మహిళా పారిశ్రామిక వేత్తలు తమ వ్యాపారాలను డిజిటలైజేషన్ చేసుకుంటే అద్భుతమైన ఫలితాలు పొందవచ్చు. అందులో భాగంగానే ప్రపంచంలో 18దేశాలలో ఏపీసీఐసీటీ సహకారంతో వైఫై డీఎక్స్ ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ శిక్షణను ప్రారంభించారు.

– మరియా, డిజిటల్ టెక్నాలజీ ట్రైనర్, ఫిలిప్పియన్

డిజిటల్ వ్యవస్థపై అవగాహన



రాగా లైఫ్ పేరుతో హెల్తీ హోమ్ మేడ్ ఫుడ్ ప్రొడక్ట్స్‌ను తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నాం. వర్సిటీ ఆధ్వర్యంలో డిజిటల్ టెక్నాలజీని వ్యాపారానికి ఎలా అనువర్తించి ప్రయోజనం పొందాలే నేర్పుతున్నారు. ప్రొడక్షన్, మార్కెటింగ్ వంటి అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ పద్ధతిలో జరపడంతో లాంటివి నేర్చుకున్నాం. త్వరలో మా సంస్థ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తాం.

– జీ.సుకన్య, రాగా లైఫ్ సంస్థ యజమాని, తిరుపతి

మహిళలకు సాంకేతిక శిక్షణ



వ్యాపారంలో మహిళలు రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఫారినర్స్‌తో మా లాంటి ఎంట్రపెన్యూర్స్‌కు శిక్షణ ఇవ్వడం ఆనందించదగ్గ విషయం. మాది పిల్లల జ్ఞానాన్ని పెంపొందించుకునే పుస్తకాలను విక్రయించే 'గుడియా స్టోర్స్' అనే పేరుతో సంస్థను నిర్వహిస్తున్నా. ఎడ్యుకేషన్ ఫర్ చిల్డ్రన్స్, స్టోరీ టెల్లింగ్, టీచర్ ట్రైనింగ్ వంటి వ్యవహారాలను నడుపుతున్న మాకు డిజిటల్ టెక్నాలజీ ఎంతో అవసరం.

–ఎస్.వెంకటభారతి, గుడియా స్టోర్స్ అధినేత, తిరుపతి

గ్లోబల్ కనెక్షన్ కావడం సులభతరం



మాది సద్భావన ఆర్గనైజేషన్. ఇందులో ప్యారెంటింగ్ గైడెన్స్, పిల్లల పెంపకంలో మెలకువలు, ఫ్యామిలీ వ్యాల్యూస్‌పై అవగాహన కల్పించే సంస్థ. పబ్లిక్‌తో ప్రతినిత్యం కనెక్టివిటీ ఉంటుంది. డిజిటల్ టెక్నాలజీ వాడకం మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

–రాధిక, సద్భావన ఆర్గనైజేషన్ అధినేత, తిరుపతి

దీపావళికి పొయ్యి వెలిగేనా?

పండుగకు ఉచిత సిలిండర్లంటూ హడావుడి

- ఇప్పటికీ విడుదలకాని మార్గదర్శకాలు
- చేతులెత్తేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు




తిరుపతి అర్బన్: సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం దీపావళి నాటికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. పండుగకు ఇక ఐదు రోజులే ఉండడం.. నేటికీ మార్గదర్శకాలు విడుదల కాకపోవడం ప్రజలను గందరగోళంలోకి నెట్టేసింది. జిల్లాలో 6,03,000 మందికి తెల్ల రేషన్‌కార్డులుండగా.. రేషన్ కార్డులున్న పేదలందరికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించాల్సి ఉంది. ఈ లెక్కన జిల్లాలో 18,09,000 సిలిండర్లు ఇవ్వాల్సి ఉంది. కాగా ప్రస్తుతం 41 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 4,92,404 కనెక్షన్లు మాత్రమే వినియోగిస్తుండగా.. మిగిలిన వారికి సిలిండర్లు ఎలా ఇస్తారో తెలియని పరిస్థితి.

గందరగోళం

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి అర్హులెవరు.. ఏయే పత్రాలు ఇవ్వాలి.. ఎవరి దగ్గర సమర్పించాలి?.. తదితర వివరాలు ఇంకా తెలియలేదు. దీనిపై ఒక్కో అధికారి ఒక్కో విధంగా చెబుతున్నారు. కొందరు ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబర్, బ్యాంక్ ఖాతా నంబర్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు సివిల్ సప్లయ్ అధికారులకు అందజేయాలని చెబుతున్నారు. అయితే వారు తమకు ఎలాంటి స్పష్టత లేదని అంటున్నారు. మరికొందరు సచివాలయంలో ఆయా పత్రాలు ఇవ్వాలని చెబుతుండగా.. వారు సమాచారం లేదని వెల్లడిస్తున్నారు. మరికొందరు ఉచిత గ్యాస్ సిలిండర్లు తెల్లరేషన్ కార్డు ఉన్న అందరికీ కాదని, గతంలో పొదుపు సంఘాల ద్వారా దీపం కనెక్షన్ ఉన్నవారికేనని చెబుతున్నారు. మరికొందరు కేంద్ర ప్రభుత్వ పథకమైన ఉజ్వల కనెక్షన్ ఉన్నవారికి ఇస్తారంటూ చర్చించుకుంటున్నారు.

మరో రెండు రోజుల్లో స్పష్టత



“ ఇప్పటి వరకు ఉచిత గ్యాస్ సిలిండర్లకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. దీపావళికి ఉచిత సిలిండర్లు ఇవ్వాలని చెప్పారు. అయితే వాటి విధి విధానాలు తెలియడం లేదు. మరో రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని భావిస్తున్నాం.

– శేషాచలం రాజు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

టీ-20 క్రికెట్ ఫియస్టాకు ఎన్ఎస్‌యూ జట్టు



టోర్నమెంట్‌కు ఎంపికైన జట్టుతో వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: తిరుపతి ఐఐటీ వేదికగా శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఉద్యోగుల టీ-20 క్రికెట్ ఫియస్టా టోర్నమెంట్‌కు జాతీయ సంస్కృత వర్సిటీ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ క్రీడారంగం వైపు విద్యార్థులను, ఉద్యోగులను ప్రొత్సహించడంలో వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ముందుంటుందన్నారు. ఫిజికల్ డైరెక్టర్ సేతురామ్, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



అలయం వద్ద సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం న్యూఢిల్లీకి చెందిన డైరెక్టర్ ఆఫ్ జనరల్ అకౌంటెంట్ కె.సుబ్రహ్మణ్యం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద అలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధివద్ద వేద పండితులు ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన

- ఫిబ్రవరి 28 వరకు ప్రత్యేక కార్యక్రమం
- తిరుపతిలో ప్రారంభించిన పశుసంవర్ధకశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంఎం.నాయక్
- 16 రకాల జంతువుల గణన



పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఎం.నాయక్, కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్: 21వ అఖిల భారత జాతీయ పశుగణన కార్యక్రమం -2024ను తిరుపతి జిల్లాలో పశు సంవర్థక శాఖ కార్యదర్శి ఎంఎం.నాయక్ శుక్రవారం ప్రారంభించారు. తిరుపతి రూరల్ మండలం, చిగురువాడ పంచాయతీలో నిర్వహించిన ఈ పశుగణన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అక్టోబర్ 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఈ పశుగణన కార్యక్రమం జరుగుతుందన్నారు. 16 రకాల జంతువులను గణన చేయనున్నట్లు వెల్లడించారు.

అందుకే గణన

పశుగణనతో పక్కాగా గణాంకాలు వస్తాయని పశుసంవర్థకశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ తెలిపారు. సదరు పశు సంపద గణాంకాలతో సమీక్షించుకుని తదనుగుణంగా రాష్ట్ర పశు సంవర్ధక ప్రణాలికలు రూపొందించడానికి ఈ సమాచారం ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ఆరోగ్యకరమైన పశుసంపద ఎంతో అవసరమని చెప్పారు. పాడి రైతులకు అవసరమైన అన్ని సేవలు ఎప్పటికప్పుడు గ్రామాల్లో అందుబాటులో ఉండి అందించాలని సూచించారు.

ప్రజలు సహకరించండి

అఖిల భారత పశుగణన-2024 కార్యక్రమానికి వచ్చే సర్వే సిబ్బందికి పశువుల సమగ్ర సమాచారం అందించి సహకరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబంలో ఉన్న పశువులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ తదితర పశు సంపదకు సంబంధించిన వివరాలు సేకరించడానికి ఆ శాఖ తరపున ఒక ఎన్యుమరేటర్ వస్తారని, వివరాల సేకరణ అనంతరం సదరు ఇంటి గోడపై స్టికర్ మార్కింగ్ చేస్తారని తెలిపారు. ఈ సర్వే కోసం జిల్లాలో 472 మంది ఎన్యుమరేటర్లు, 77 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. అంతకు ముందు గోమాతకు ప్రత్యేక పూజలు చేసి, దాణా తినిపించారు. ఎన్యుమరేషన్ కరదీపికను, వివరాల సేకరణ అనంతరం అతికించే స్టికర్లను, ఐడీ కార్డులను, పోస్టర్లను, కర పత్రాలను, కిట్ బ్యాగ్‌ను ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, పశుసంవర్థకశాఖాధికారులు పాల్గొన్నారు.

మూడు చోట్ల బాణసంచా విక్రయ కేంద్రాలు



కేపీ భాగ్యలక్ష్మి, తహసీల్దార్

తిరుపతి అర్బన్: దీపావళి పండుగ నేపథ్యంలో తిరుపతిలో మూడుచోట్ల బాణసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి తెలిపారు. నగరంలో డీబీఆర్ రోడ్డులోని చివరి ప్రాంతంలో ఒక కేంద్రం, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ వద్ద మరో కేంద్రం, ఎయిర్ బైపాస్ రోడ్డులో రాస్ కార్యాలయం ఎదురు వీధి చివరిలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలోనూ అవే ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు తెలియజేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

'మట్టి' కొట్టుకుపోతారు!



జేసీబీలను పెట్టి ఏపీఐఐసీ భూముల్లోని ఎర్రమట్టిని తాటిపర్తి, కల్లిపూడికి తరలిస్తున్న అక్రమార్కులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తొట్టంబేడు మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. ఇసుక, మట్టి అక్రమ రవాణాతో కోట్లు గడిస్తున్నారు. మండలంలోని ఓ టైల్స్ కంపెనీకి మట్టి తోలే కాంట్రాక్టు దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు తాటిపర్తి తెలుగుకాలువ కట్ట మట్టి, ఏపీఐఐసీ భూముల్లో మట్టిని కొల్లగొడుతున్నారు. టిప్పర్లు, లారీల ద్వారా రోజుకు రూ.2 లక్షలు.. నెలకు రూ.60 లక్షల వరకు గడిస్తున్నారు. ఇలా నాలుగు నెలల్లో దాదాపు రూ.2కోట్లకుపైగా మట్టిని అమ్మేశారు. గతనెలలో ఓ వ్యక్తి మట్టి తరలించే ట్రాక్టర్ కింద పడి మృతిచెందాడు. ఏపీఐసీసీ భూముల్లో వాచర్లు ఉన్నా వారుపట్టించుకోకపోవడం కొసమెరుపు.

కింది కోర్టు తీర్పు రద్దు

తిరుపతి లీగల్ : నాలుగు వేర్వేరు చోరీ కేసుల్లో కింది కోర్టు విధించిన శిక్ష కాలాన్ని తొలగించి రూ.2వేల చొప్పున జరిమానా చెల్లించాల్సిందిగా నిందితుడు రాజాను ఆదేశిస్తూ తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు.. నగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్.రాజా ఆవుల చోరీకి పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు కేసులు నమోదు చేసి నగిరి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి అతనికి ఒక్కొక్క కేసులో రెండేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ 2022లో తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై అతను తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలు దాఖలు చేశాడు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం కింది కోర్టు విధించిన శిక్ష కాలాన్ని రద్దుచేసి పై విధంగా తీర్పు చెప్పారు.

ముచ్చటగా మూడో సారి వీఆర్వోల బదిలీ

తిరుపతి అర్బన్: ముచ్చటగా మూడో సారి వీఆర్వోల బదిలీలను చేపట్టారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఏడాది పాటు బదిలీలు చేస్తునే ఉంటారా..? అంటూ పలువురు బాహాటకంగానే విమర్శలు చేస్తున్నారు. సెప్టెంబర్ 28వ తేదీన తొలిసారిగా 242 మంది వీఆర్వోలను బదిలీ చేశారు. ఆ తర్వాత ఈనెల 6వ తేదీ రెండో సారి 113 మందిని, తాజాగా శుక్రవారం నాయకుల ఒత్తిళ్లతో మూడో సారి 54 మందిని బదిలీ చేశారు.

టీటీడీ ఈఓ విస్తృత తనిఖీలు



తనిఖీ నిర్వహిస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుమల: తిరుమలలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, అడిషనల్ ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముందుగా వకుళామాత కేంద్రీయ వంటశాలను పరిశీలించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న పీఏసీ-5ని తనిఖీ చేశారు. అనంతరం కౌస్తుభం, సప్తగిరి, ఎస్ఎంసీ, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద హోటళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి శిలాతోరణం వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం టీటీడీ నిర్మిస్తున్న నూతన క్యూలైన్లు, మరుగుదొడ్లు, ఫుడ్ కోర్టులను పరిశీలించారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈలు వేణు గోపాల్, సుబ్రహ్మణ్యం, డీఈ చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వరులు, డెప్యూటీ ఈఓ (హెల్త్) ఆశాజ్యోతి, హెల్త్ అధికారి డాక్టర్ మధుసూదనప్రసాద్, వీజీఓ సురేంద్ర పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ గౌతమి

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్(టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు) ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని టీటీడీ జేఈఓ (విద్య-ఆరోగ్యం) గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం టీటీడీ పరిపాలనా భవనంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న ఎన్నికలకు తిరుమలలోని ఎస్వీ హైస్కూల్, తిరుపతిలోని ఎస్జీఎస్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని చెప్పారు. ఓటు వేసేందుకు వచ్చే ప్రతి ఉద్యోగి తమ ఒరిజినల్ ఐడీ కార్డు తప్పనసరిగా తీసుకురావాలన్నారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి లక్ష్మి, ఎన్నికల అధికారి ఉమాపతి, ఝాన్సీ, టీటీడీ సంక్షేమ అధికారి ఆనందరాజు, ఎస్ఈలు మనోహరం, వేంకటేశ్వర్లు, వీజీవో సదాలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ ఆశాలత, సీఎంఓ నర్మద పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

తిరుపతి సిటీ: గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలని, అధునాత సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు అందించాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్‌లో గ్రంథాలయ, సమాచారశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే స్వర్ణోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డిజిటల్ టెక్నాలజీ వంటి అధునాతన విద్యా పద్ధతుల్లో విద్యార్థులకు బోధించాలని సూచించారు. ద్రవిడ వర్సిటీ వీసీ దొరస్వామి మాట్లాడుతూ తాను ఉపకులపతి స్థాయికి ఎదిగినా, గ్రంథాలయ, సమాచారశాస్త్ర విభాగాన్ని, బోధించిన గురువులను జీవితంలో మర్చిపోలేనని చెప్పారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ గ్రంథాలయాలు అంటే సరస్వతి నిలయాలని చెప్పారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కే.సుధారాణి, ఆ విభాగం వ్యవస్థాపకులు శ్రీపతి నాయుడు, విభాగాధిపతి ప్రశాంత కుమారి, రిటైర్డ్ ప్రొఫెసర్లు రాజగోపాల్, పుల్లారెడ్డి, పద్మిని, పూర్వ విద్యార్థులు రావి శారద, వెంకటేశ్వర్లు, నారాయణమూర్తి, రమేష్‌బాబు, అకడమిక్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

పుస్తకాలిస్తాం అంతే!

- వసతి, భోజనం లేదు
- డీఎస్సీ ఉచిత శిక్షణపై కూటమి సర్కార్ యూటర్న్

తిరుపతి అర్బన్: డీఎస్సీ ఉచిత శిక్షణ అంటూ ఆర్భాటం చేసిన కూటమి సర్కార్ చివరకు చేతులెత్తేసింది. శిక్షణ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులకు భోజనం, వసతి లేదని తేల్చిచెప్పేసింది. పుస్తకాలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. తమకు వచ్చిన 300 దరఖాస్తుల్లో ఇంటర్, డిగ్రీలో ఎక్కువ మార్కు లు వచ్చిన 200 మందిని ఎంపిక చేసినట్టు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

470 దరఖాస్తులు.. 150 మంది మాత్రమే అర్హులు

ఎస్సీ వెల్ఫేర్ నేతృత్వంలో డీఎస్సీ ఉచిత శిక్షణకు 470 దరఖాస్తులు రాగా.. అందులో 150 మందిని అర్హులుగా ప్రకటించారు. దరఖాస్తులకు మరో రెండు రోజులు పొడిగించినట్టు ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య తెలిపారు. వసతి, భోజనం విషయంపై స్పష్టత లేదన్నారు. తిరుపతితోపాటు చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలకు సంబంధించి వంద మంది ఎస్టీ విద్యార్థులకు అవకాశం కల్పించినట్టు ఆ విభాగం జిల్లా అధికారి సూర్యనారాయణ తెలిపారు.

ఆరు నెలలు ముందే పెన్షన్ ప్రతిపాదనలు

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణకు ఆరు నెలల ముందే పెన్షన్‌కి సంబంధించిన ప్రతిపాదనలతోపాటు డీడీఓలు పంపాలని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ సీ.చంద్రమౌళిసింగ్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పెన్షనర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో పెన్షనర్ల దరఖాస్తులు పంపడంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్ నామినీ, మిస్సింగ్ క్రెడిట్స్ తదితర సమస్యలపై అవగాహన కల్పించారు. ఉన్నతాధికారులు మోహన్‌రావు, విజయ్ కుమార్, సునీత కుమారి, తిరుపతి జిల్లా ట్రెజరీ అధికారి లక్ష్మీకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్యాల పెంపు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

గూడూరు రూరల్: పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినిరింగ్ కళాశాలలో శుక్రవారం ఉపాధి నైపుణ్య శిక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇందులో విశాఖపట్నానికి చెందిన కౌన్సిల్ ఫర్, స్కిల్స్, అండర్ కాపిటేటివ్ సలహాదారు, రామోహన్‌రావు, ఇంచార్జ్ ప్రిన్సిపల్ వేణుమాదవ్‌లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి నైపుణాలను పెపొందించేందుకు ఈ అవగాహన ఒప్పదం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సాంకేతిక మీద సీ డాక్, ఐఈఈఈ ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ 3డీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రొసెసింగ్, వాద్వాని ఫౌండేషన ద్వారా 21వ శాతబ్దపు ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపక శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. కళాశాల ఫౌండర్ డాక్టర్ వంకి పెంచలయ్య, వైస్ ఛైర్‌పర్సన్ వంకి అనూషా, డీన్ డాక్టర్ రాజయ్య, సీఈఓ ఇమ్మానుయే పాల్గొన్నారు.

కూనాటి సురేష్‌కు అరుదైన అవకాశం



కూనాటి సురేష్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు పాఠశాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌కు అరుదైన అవకాశం లభించింది. జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ వారు ఈనెల 28, 29 తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహించనున్న మూల్యాంకన విధానంలో 'విద్యార్థుల స్థాయిని అనుసరించి సమతుల్యతను పాటించడం'అనే అంశం పై ఆయన ప్రసంగించనున్నారు.

ఆటోను ఢీకొన్న కంటైనర్

– ఆరుగురు విద్యార్థులకు గాయాలు



దెబ్బతిన్న ఆటో

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని మూర్తిరెడ్డిపాళెం గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై ఆటోను కంటైనర్ లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. కూచివాడ, కాపులూరు, అయ్యప్పరెడ్డిపాళెం, కల్లిపేడు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆటోలో నాయుడుపేటలో ఉన్న ప్రైవేటు కళాశాలకు బయల్దేరారు. మార్గ మధ్యంలో మూర్తిరెడ్డిపాళెం గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది వంతెన వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ డ్రైవర్ నిద్ర మత్తులో వేగంగా వచ్చి ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటో ఫల్టీలు కొట్టి బోల్తా పండింది. ఆటోలో ఉన్న ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వీరిలో బాలాజీ, వంశీ అనే ఇద్దరు విద్యార్థులను 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అవగాహనతో రొమ్ము క్యాన్సర్ దూరం



ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ వీ.ఉమ

తిరుపతి సిటీ: మహిళలు అవగాహన కలిగి ఉంటే రొమ్ము క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చని స్వీకార్ మెడికల్ డైరెక్టర్, సర్జికల్ ఆంకాలజీ హెడ్ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. మహిళా వర్సిటీ అధ్యయన కేంద్రం, స్వీకార్ టాటా ట్రస్ట్ ఫర్ ఏ క్యాన్సర్ ఫ్రీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా వర్సిటీ ధృతి ఆడిటోరియంలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రాణాంతకంగా మారిన ఆరోగ్య సమస్యల్లో రొమ్ము క్యాన్సర్ ఒకటని, చాలా మంది మహిళలు అవగాహనా లేమి, సామాజిక కళంకం అనే అపోహతో దీన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ముందస్తుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చని చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీని వీసీ వీ.ఉమ జెండా ఊపి ప్రారంభించారు. డీన్ ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి, డాక్టర్ అనూష, డాక్టర్ నాగేశ్వర్‌రావు, బాబురావు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించండి



కలెక్టర్‌తో మామిడి పండ్ల వ్యాపారులు

తిరుపతి అర్బన్: మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల పండ్ల పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యాపారులు కలెక్టరేట్‌లో తిరుపతి కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసి విన్నవించారు. గిట్టుబాటు ధర వచ్చేలా సాయం చేయాలని కోరారు. అనంతరం ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. పండ్ల పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి కట్టమంచి బాబి, ఇతర సభ్యులు విద్యాసాగర్‌రెడ్డి, ఉమాపతి, నందగోపాల్, లోకాద్రి, గాంధీ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ అంధకారమే



ఎస్వీయూలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: ర్యాగింగ్ భూతం ప్రమాదకరమని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను అంధకారం చేస్తుందని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో యాంటీ ర్యాగింగ్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వర్సిటీలో చదవడం అదృష్టమని, సీనియర్లు జూనియర్‌లతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టాలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. వీసీ సీహెచ్.అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, డీఎస్పీ వెంకటనారాయణ, డీన్ చిన్నరాయుడు, మురళీధర్, కో-ఆర్డినేటర్ వివేక్, సీఐ రామయ్య పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వ వహిస్తే సహించేదిలేదని ఎస్పీ స్పష్టం చేశారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ సావేరీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. దీపావళి పండుగ నేపథ్యంలో టపాకాయల దుకాణాలు నిర్దేశిత ప్రాంతాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో బెల్ట్ షాపులు లేకుండా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణ, రామకృష్ణ, శ్రీనివాసరావు, తిరుపతి, తిరుమల, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.